తక్కువ ధరకే నాణ్యమైన ఆహారం


ఆహా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్


ఆస్పత్రి భవనం శ్లాబ్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

- భీమవరంలో ఆహా క్యాంటీన్ ప్రారంభం
- ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం ప్రకాశంచౌక్: శుచి, రుచికరమైన ఆహారాన్ని ఇంటి వద్దే వండి తక్కువ ధరకే నాణ్యమైన ఆహారం అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆహా క్యాంటీన్లను పట్టణాల్లో ఏర్పాటు చేస్తున్నారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. మావుళ్లమ్మ గుడి పక్కన మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆహా క్యాంటీన్‌ను ఎమ్మెల్యే శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులచే ఈ క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నారని, తద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. మహిళల కోసం ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన పథకాల్లో ఆహా క్యాంటీన్‌ల రూపంలో మరొకటి చేరిందన్నారు. ఆహా క్యాంటీన్ల ఏర్పాటుకు మహిళ సమాఖ్య సభ్యులకు రూ.13 వేలు ఆర్థిక సాయం మెప్మా ద్వారా ప్రభుత్వం అందిస్తోందని వివరించారు. ఈ క్యాంటీన్ ద్వారా మార్కెట్ ధర కన్నా తక్కువకు ఆహార పదార్థాలు అందిస్తారని చెప్పారు. మహిళలు ఆర్థిక బలోపేతానికి ఇప్పటికే జగనన్న మహిళా మార్టులు, అర్బన్ మహిళా మార్టులను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మహిళలకు ప్రాధాన్యత ఇస్తూ.. అన్ని రకాలుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకుంటున్నారని, నవరత్నాల్లో సింహభాగం మహిళల కోసం రూపకల్పన చేశారని ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, మెప్మా అధికారులు నాని బాబు, శాంతి కుమారి, జై కృష్ణ, కృపామణి తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా ఆసుపత్రి నిర్మాణం

భీమవరం(ప్రకాశం చౌక్): 100 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు శరవేగంగా నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. ఆస్పత్రి నిర్మాణానికి సంబంధించిన శ్లాబ్ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రి నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. తొలవిడతగా 50 పడకల ఆసుపత్రి నిర్మాణానికి ప్రభుత్వం రూ.10.15 కోట్లు కేటాయించిందని, మరో 50 పడకల ఆసుపత్రి నిర్మాణానికి సుమారు రూ.30 కోట్లు మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నాబార్డుకు ప్రతిపాదనలు చేసిందని చెప్పారు. త్వరలోనే ఈ నిధులు మంజూరతాయని తెలిపారు. ఆసుపత్రికి వెళ్లడానికి 40 అడుగుల రోడ్డు నిర్మిస్తున్నామని, ఆస్పత్రి వెనుక నుంచి కొమరాడ రోడ్డుకు లింకు రోడ్డు కూడా నిర్మించేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందించామని వివరించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి భీమవరం పర్యటనకు వచ్చినప్పుడు వంద పడకల ఆసుపత్రి అవసరాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లగా సానుకూలత వ్యక్తం చేశారని గుర్తుచేశారు. తాను 2019లో రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం ఈ వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి మరోసారి ప్రయత్నించగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేశారని తెలిపారు. ఈ ఆస్పత్రి పూర్తయితే భీమవరం నియోజకవర్గ ప్రజలతో పాటుగా జిల్లా ప్రజలకు, కృష్ణా జిల్లా తీరప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. కార్యక్రమంలో ఏఐఎండీసీ డీఈ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహారాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహారావు, ఏఎస్ రాజు, పిప్పళ్ల నాని, బొర్ర వాసు, గాదిరాజు తాతరాజు, ముత్యాల బుజ్జి, రాట్నాల సత్యనారాయణ, మలవలస నాగేంద్ర, గాదిరాజు రామరాజు, కట్టా రవి, చెల్లబోయిన సూర్యప్రకాష్, కొవ్వాడ రాజు, ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆకివీడులో గడపగడపకు మన ప్రభుత్వం

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ కార్యాలయం పరిధిలోని సచివాలయం–3లో 19వ వార్డు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఐదవ రోజు ఈ నెల 30వ తేదీ బుధవారం ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుందని నగర పంచాయతీ కమిషనర్ జి.కృష్ణ మోహన్ మంగళవారం చెప్పారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, కౌన్సిలర్లు పాల్గొంటారని చెప్పారు. నగర పంచాయతీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు విధిగా హాజరుకావాలని ఆదేశించారు.

రేపు ఆకివీడు నగర పంచాయతీ సమావేశం

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు జరగనుందని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి మంగళవారం విలేకరులకు చెప్పారు. నగర పంచాయతీలోని వివిధ వార్డుల్లో అభివృద్ధి, సమస్యలపై చర్చించి, అజెండాల్లోని అంశాలపై చర్చిస్తామని పేర్కొన్నారు. సమావేశానికి సంబంధిత అధికారులు, కౌన్సిలర్లు హాజరుకావాలని కోరారు.

విద్యాభివృద్ధికి ప్రాధాన్యత

సాక్షి, భీమవరం: విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి ప్రశంసనీయమని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ సెల్ సభ్యుడు, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. మంగళవారం భీమవరంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యత ఇవ్వడం పేదలకు ఎంతో మేలు చేకూరుతుందని అన్నారు.

తణుకులో 2కే రన్

తణుకు అర్బన్: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం తణుకు ఎస్సీఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో 2కె రన్ నిర్వహించారు. ఈ 2కే రన్‌లో విజేతలకు పుట్టా ప్రసాద్, జక్కంశెట్టి ప్రసాద్, శ్రీసిటి ఎమర్జెన్సీ హాస్పిటల్స్, పత్తుల ఆశిష్ విక్టర్, సంకు దుర్గాప్రసాద్, చేగొండి రామకృష్ణ, బట్టు ధర్మారావు, దాకి ఝాన్సీలక్ష్మీబాయిల సహకారంతో మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందచేసినట్లు అసోసియేషన్ కార్యదర్శి సంకు సూర్యనారాయణ తెలిపారు. మానేపల్లి శ్రీనివాస్, మద్దాల శ్రీనివాస్, అసోసియేషన్ అధ్యక్షులు సీహెచ్ సత్యనారాయణ, ఉపాధ్యక్షులు ఎన్‌వీవీ సత్యనారాయణ, కోశాధికారి కె.బాబూరావు, సహాయ కార్యదర్శి ఆర్.రామకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు ఎఆర్ అప్పారావు, కె.సుబ్బారావు, బి.సుబ్రహ్మణ్యం, కె.శ్రీనివాస్, ఎ.నాగేశ్వరరావు, ఎం.నాగరాజ్యం, పి.జయమ్మ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు భేష్

మొగల్తూరు: సంక్షేమ పథకాల అమలు తీరు బాగున్నాయని కేంద్ర ప్రభుత్వానికి చెందిన అధికారులు ప్రశంసించారు. కేంద్ర ప్రభుత్వ సెక్రటేరియట్‌లోని వివిధ శాఖలకు చెందిన అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ల బృందం మంగళవారం మొగల్తూరు మండలంలో పర్యటించారు. మొగల్తూరులోని 1,3 సచివాలయాలను సందర్శించారు. లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందిస్తున్న తీరును ఈఓపీఆర్డీ నవీన్ కిరణ్ వివరించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. మొగల్తూరు భారీ మంచినీటి చెరువు ను పరిశీలించి జలజీవన్ మిషన్ నిధులు విని యోగంపై అడిగి తెలుసుకుని, జలజీవన్ మిషన్ నిధుల తో నిర్మించిన ఓహెచ్ఎస్ఆర్‌ను పరిశీలించారు. కొత్తపాలెంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూసర్వేను పరిశీలించారు. శేరేపాలెం పంచాయతీ నవుదూరుగరువులో నిర్వహించిన పొలం బడి కార్యక్రమాన్ని పరిశీలించి పీఎం కిసాన్‌కు అర్హులైన రైతులను గుర్తించే విధానాన్ని ఏఓ రహీమ్‌ను అడిగి తెలుసుకున్నారు. హేమంత్ మీనా, నిషి ఇండోరా, బాసుదేవ్ యాదవ్, మయాంక్ అగర్వాల్, విశాల్, హిమాన్స్ షైనీ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమ సారథి సీఎం జగన్

డీసీసీబీ చైర్మన్ పీవీఎల్


పెదఅమిరంలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

కాళ్ల: పేదల సంక్షేమ సారథి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్‌నర్సింహరాజు తెలిపారు. మండలంలోని పెదఅమిరంలో గడపగపడకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఉదయం, సాయంత్రం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రతీ కుటుంబం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. సంక్షేమ పథకాలు పొందుతూ ప్రతీ కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. పేద ప్రజల పక్షపాతి అయిన జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దని హితవు పలికారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో ఉండిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగిరేందుకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, కోపల్లె సొసైటీ అధ్యక్షుడు వేగేశ్న జయరామకృష్ణంరాజు, పెనుమత్స ఆంజనేయరాజు, జవ్వాది సత్యనారాయణ, బిరుదుగడ్డ గంగాధర్, బొరుదుగడ్డ రమేష్, సరాబు ముఖేష్, కాటిక ఆనందరాజు, పెనుమత్స రంగరాజు, బొత్స అచ్చారావు, గంటా బాలు, బండి మహంకాళి, గొళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి విశేష కృషి


జువ్వలపాలెంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు.

కాళ్ల: గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ప్రత్యేక ప్రణాళికలతో గ్రామాలను అభివృద్ధి చేస్తున్నట్లు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు తెలిపారు. మంగళవారం జువ్వపాలెం గ్రామ దేవత పైడమ్మ అమ్మవారి 77వ వార్షిక జాతర మహోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పీవీఎల్, గోకరాజు రామరాజు పాల్గొన్నారు.అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే గ్రామంలో మండల పరిషత్ సహాయ నిధులు రూ.6 లక్షలు, జెడ్పీ నిధులు రూ.15 లక్షలు, 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.5 లక్షలు, ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షల అంచనాలతో నిర్మాణం చేపట్టబోయే మూడు సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కటారి లక్ష్మీపతిరాజు, ఎంపీటీసీలు శ్రీనివాస్, బెన్హర్, రుద్రరాజు వెంకటరామకృష్ణంరాజు, ముదిండి సురేష్ పాల్గొన్నారు.

కేంద్ర విధానాల వల్లే ధరల పెరుగుదల


ఉండిలో సంతకాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

ఉండి: కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల దేశంలో ధరలు విపరీతంగా పెరిగిపోయాయని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జీఎస్‌వీ గోపాలన్ మండిపడ్డారు.ధరల పెరుగుదలకు నిరసనగా ఉండి సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ దేశంలో నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పేదవాడు మరింత పేదవాడిగా మిగిలిపోతున్నాడని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్, రామకూరి వెంకటరత్నం, కొట్టాడ వెంకటేశ్వరరావు, కడలి నాగేశ్వరరావు, వంజరపు సూర్యనారాయణ, కట్టా సుబ్బారావు కాలువ ఏసు తదితరులు పాల్గొన్నారు.

వేంద్రలో...

పాలకోడేరు: మండలంలోని వేంద్ర గ్రామంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జేఎస్‌వీ గోపాలన్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సంతకాల సేకరణ చేపట్టారు. ఈ ఉద్యమంలో భాగంగా గ్రామ వార్డు సచివాలయాలకు సెప్టెంబర్ 1న విజ్ఞాపన పత్రాలు, సెప్టెంబర్ 4న ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. వేంద్ర అగ్రహారం మాజీ సర్పంచ్ వితంబి టి.రామారావు, వైఎస్ఎస్ మూర్తి, కె.అప్పారావు పాల్గొన్నారు.

నాగూర్ మీరావలికి అండగా ఉంటాం


ఆసుపత్రి వైద్యులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి

పెనుగొండ: ఆచంట రోడ్డులో రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలు పాలైన ఆచంట వేమవరం గ్రామానికి చెందిన షేక నాగూర్ మీరావలికి అండగా ఉంటానని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు తెలిపారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో షేక్ మీరావలికి తల పగలడంతో పాటు, వెన్నెముక విరిగిపోయిందని వైద్యులు ధ్రువీకరించి వైద్యానికి రూ.8 నుంచి 10 లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో వైద్యం చేయించుకొనే పరిస్థితి లేకపోవడంతో ప్రాణాలు నిలబెట్టమంటూ బంధువులు, స్నేహితులు అర్థిస్తున్నారు. వారు మంగళవారం మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును మంగళవారం కలిసి వైద్య సహాయం అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి స్పందించి వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ జక్కంశెట్టి చంటి, కర్లబత్తుల కార్పొరేషన్ డైరక్టరు అందే నాగబసవన్న, పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆటంకం

గ్రామాల్లో అభివృద్ధి జరగకుండా రెచ్చగొట్టి విద్వేషాలు రగలుస్తున్నారని మాజీమంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆరోపించారు. మంగళవారం తూర్పుపాలెంలో సోమరాజు చెరువు గ్రామస్థులు డ్రయినేజీ నిర్మాణంపై మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును కలిశారు. గ్రామంలోని సమస్యలను ఇబ్బందులు లేకుండా ముందుగానే సమావేశం నిర్వహించుకుని పరిష్కరించుకోవాలన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు కొందరు కొన్ని ప్రాంతాల్లో విఘాతం కల్గిస్తున్నారన్నారు. దీనిని ప్రజలే తిప్పి కొట్టాలన్నారు. సమావేశంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), ఆచంట మండల సర్పంచ్ సంఘ అధ్యక్షుడు సుంకర సీతారామ్, పార్టీ ప్రధాన కార్యదర్శి దంపనబోయిన బాబూరావు, జి రమేష్, దంపనబోయిన భోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగుభాషా దినోత్సవం


భీమవరం బీవీరాజు పార్క్ వద్ద నిర్వహిస్తున్న తెలుగుభాషా దినోత్సవం


ఆకివీడు జెడ్పీ స్కూల్‌లో విద్యార్థుల ప్రదర్శన

సాక్షి, భీమవరం: తెలుగు భాషా దినోత్సవాన్ని భీమవరం పట్టణంలో స్వచ్ఛంద సంస్థలు, పాఠశాలల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ముగింపు సందర్భంగా బీవీ రాజు పార్క్‌లోని తెలుగు తల్లి విగ్రహం వద్ద ఝాన్సీలక్ష్మీభాయ్ మునిసిపల్ స్కూల్ విద్యార్థులు కవుల వేషధారణలతో నిర్వహించిన కవితా గోష్టి ఆకట్టుకుంది. తెలుగు పండితుడు కలిగొట్ల గోపాలశర్మ మాట్లాడుతూ తెలుగు భాష ఔన్నత్యం ప్రపంచ స్థాయికి వెళ్లిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, చుక్కన శ్రీ, జవ్వాది దాశరధి శ్రీనివాస్, సీహెచ్ జగన్మోహన్‌రావు, అరసవల్లి సుబ్రహ్మణ్యం, గంధం శ్రీదేవి, మెంటే పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలో భారతీయ విద్యాభవన్స్ స్కూల్, పొట్టి శ్రీరాములు మునిసిపల్ గరల్స్ హైస్కూల్, డీఎన్నార్ కళాశాల, ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

అమ్మ కంటే మధురమైన భాష తెలుగు

భీమవరం అర్బన్: అమ్మ కంటే తెలుగు భాష మధురమైనదని పేరెంట్స్ కమిటీ చైర్మన్ గూడపాటి మిల్టన్ అన్నారు. భీమవరం మండలం అనాకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాష, క్రీడా దినోత్సవాలను నిర్వహించారు. విద్యార్థులకు తెలుగు భాష ప్రాముఖ్యతను వివరించారు. తెలుగులో వ్యాసరూప పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. తెలుగు భాష ఉపాధ్యాయుడు ఎస్ ప్రేమరాజు, డి.కనకరత్నం, వ్యాయామ ఉపాధ్యాయుడు జి.నర్మదలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకివీడులో...

ఆకివీడు: తెలుగు భాషపై పిడుగులాంటి ఉద్యమం చేసి తెలుగు ప్రజల వాడుక భాషకు ప్రాధాన్యత తెచ్చిన గొప్ప వ్యకిత గిడుగు రామమూర్తి పంతులు అని ప్రధానోపాధ్యాయులు టి.పోతురాజు కొనియాడారు. గిడుగు జయంతి సందర్భంగా స్థానిక పీఎల్ఎస్ జెడ్పీ స్కూల్లో భాషావారోత్సవాల ముగింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు, పామరులకు అర్థమయ్యే విధంగా భాష ఉన్నప్పుడే భాష మనుగడ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. తెలుగుతో పాటు ఆంగ్ల విద్య నేర్చుకుంటూ ఉన్నత స్థితికి వెళ్లాలని పోతరాజు పిలుపునిచ్చారు. తొలుత పాఠశాల ఆవరణలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు, దేశ నాయకులు ఏకపాత్రాభినయాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. గత వారం రోజులుగా విద్యార్థులతో నిర్వహించిన వ్యాసరచన, వకృత్వ పోటీల్లో విజేతలకు, సాంస్కృతిక ప్రదర్శనలకు బహుమతుల్ని అందజేశారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

నరసాపురం రూరల్: పట్టణంలోని వాసా సామ్యేలు వీధిలోని బెతెస్థ టెంపుల్‌లో గురువారం డాక్టర్ విక్టర్ క్లినిక్ ఆధ్వర్యంలో డయాబెటిస్, హైపర్ టెన్షన్, కంటి, జనరల్ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు అరిటాకుల సుగుణపాల్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ శిబిరంలో డాక్టర్ పీజే అలెగ్జాండర్ నేతృత్వంలో సేవలందిస్తారన్నారు. కంటి సమస్యలైన మేహ చుక్క, కళ్ల కలక, తలనొప్పి, కళ్లజోడు పరీక్ష లతో పాటు వివిధ రకాల జ్వరాలు, జీర్ణకోశ వ్యాధులు, కీళ్లనొప్పులు, ఊపిరితిత్తులు, మూత్రసంబంధిత వ్యాధులకు చికిత్స చేస్తారని వివరించారు.

అక్టోబరు 2 నుంచి 'ఆడుదాం ఆంధ్ర'

తాడేపల్లిగూడెం అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలను ప్రోత్సహించే దిశగా అక్టోబర్ 2వ తేదీ నుంచి 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టారని స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కర్రి విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి నిర్వహించిన సమావేశంలో మాట్లాడతూ జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం పలు విషయాలపై చర్చించారు. విద్యార్థులు విద్యనభ్యసించడంతోపాటు క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయికి రాణించాలన్నారు. సిఎం కప్పు పేరుతో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడా పోటీలు అక్టోబరు 2వతేదీన నుంచి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆదిశగా జిల్లాలోని 535 సచివాలయాల ద్వారా ఆడుదాం ఆంధ్రలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అండర్ –17 క్రికెట్ పోటీలకు ఎంపికైన వాణీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులను డైరెక్టర్ విజయలక్ష్మి అభినందించారు. ఈ కార్యక్రమంలో కర్రి భాస్కరరావు, వాణి స్కూల్ అధినేత వాణికృష్ణ, వాని సేవా సంస్థ అధ్యక్షుడు అభ్యుదయ, విద్యార్థులు పాల్గొన్నారు.

బలుసులమ్మకు వెండి సమర్పణ

తాడేపల్లిగూడెం: పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ వారికి ప్రముఖ వైద్యులు డాక్టర్ చిట్యాల సురేంద్రకుమార్, పద్మిని దంపతులు మంగళవారం అర కిలో వెండిని ఆలయంలో అర్చకులకు అందించారు. అనంతరం వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు వట్టిపోలు రాము పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్రీడలతో ఉజ్వల భవిష్యత్


శివాజీరాజును సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: క్రీడా స్ఫూర్తి విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతుందని జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు డి.శివాజీరాజు అన్నారు. జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలోని క్రీడాకారులు జాతీయ పతాకాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం వాలీబాల్ జాతీయ క్రీడాకారుడు శివాజీరాజు, కళాశాల వాలీబాల్ కోచ్ రామరాజులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్ రంగరాజు, వైస్ ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణ రాజు, ఫిజికల్ డైరెక్టర్ పి.సత్యనారాయణరాజు, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్స్ సీహెచ్ హరిమోహన్, జి.సారిక, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ల బహూకరణ

పాలకొల్లు అర్బన్: ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్షేమ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు వసతులు కల్పించడానికి దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి.రాంబాబు అన్నారు. పట్టణంలోని శంభునిపేటలో ఉన్న ఎస్సీ బాలికల వసతి గృహానికి ఆయన విరాళంతో రెండు ఫ్యాన్‌లు, అలాగే ఏఎస్సై శివాజీ విరాళంతో పది గొడుగులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా కార్యదర్శి మద్దా చంద్రకళ, సంక్షేమాధికారి శోభారాణి పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు అధిక ప్రాధాన్యం


పోలీస్ స్టేషన్ వద్ద ఎస్పీతో సిబ్బంది

యలమంచిలి: జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎస్పీ యు.రవిప్రకాష్ తెలిపారు. వార్షిక తనిఖీలో భాగంగా మంగళవారం ఆయన యలమంచిలి పోలీస్ స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేసి, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేరాల అదుపునకు సిబ్బంది కృషి చేయాలన్నారు. క్రైమ్ రేట్ తగ్గించడంతోపాటు ప్రజల రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నరసాపురం డీఎస్పీ రవి మనోహరాచారి, పాలకొల్లు రూరల్ సీఐ కొండ వీటి శ్రీనివాస కుమార్, ఎస్సై జాజుల విజయ్ నాగ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ బీమా చెక్కు అందజేత

పాలకొల్లు అర్బన్: మండలంలోని దిగమర్రులో లివర్ క్యాన్సర్‌తో బాధపడుతూ మృతి చెందిన రాపాక సంతోష్‌కుమార్ కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద రూ.లక్ష మంజూరైంది. ఈ చెక్కును సంతోష్‌కుమార్ భార్య లక్ష్మీకుమారికి మంగళవారం సర్పంచ్ రాపాక నగేష్‌కరుణాకర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొండేటి మల్లికార్జునరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ లోకేష్ పాల్గొన్నారు.

లక్ష్యాలను సాధించాలి

పెంటపాడు: ప్రభుత్వం నిర్దేశించిన పశుసంవర్ధక శాఖ లక్ష్యాలను సిబ్బంది సాధించాలని గూడెం డివిజన్ పశుసంవర్ధక శాఖ డీడీ డాక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. మంగళవారం పెంటపాడు పశుసంవర్ధకశాఖ డివిజన్ కార్యాలయంలో జిల్లా పశువైద్యుల సంఘ జిల్లా అధ్యక్షుడు, పెంటపాడు మండల పశువైద్యాధికారి డాక్టర్ మహేష్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని పశువైద్యులు, లైవ్‌స్టాక్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన వై. విజయభాస్కరరావును సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త ఆనందరావు, గూడెం మున్సిపల్ కమీషనర్ ఎ.శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

నందమూరులో పొలంబడి

తాడేపల్లిగూడెం రూరల్: దోమ పోటు నివారణకు ముందస్తుగా పురుగు మందులు పిచికారి చేయవద్దని మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని నందమూరు గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో ప్రసాద్ మాట్లాడుతూ వరిపై అక్కడక్కడా నల్లి, సల్ఫైడ్ ప్రభావం కనబడుతుందన్నారు. అది కూడా తక్కువ మోతాదులోనేనని పేర్కొన్నారు. వీటి నివారణకు ముందస్తుగా మందులు పిచికారి చేయవద్దన్నారు. నల్లి నివారణకు ప్రొఫినోఫాస్ పిచికారి చేసుకోవాలన్నారు. సల్ఫైడ్ ప్రభావాన్ని తగ్గించడానికి రెండు, మూడుసార్లు నీరు మార్చాలని సూచించారు. తర్వాత ఎకరానికి 15 నుంచి 20 కిలోల పొటాష్ వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీకే ఇన్‌చార్జ్ జాలపర్తి సతీష్, ఏఈవో మాధవ వర్మ, రైతులు దానయ్య, శివ, శ్రీనివాస్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.